ప్రజా విశ్వంభర V3 NEWS

సంక్షేమంలో తెలంగాణకు పూర్తి సహకారం అందిస్తాం

సామాజిక న్యాయం మరియు సాధికారత శాఖ కార్యదర్శి సుధాంశ్ పంత్

పలు సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను కేంద్ర కార్యదర్శికి వివరించిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు భేష్ అంటూ కితాబు.

విశ్వంభర, హైదరాబాద్: కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత శాఖ కార్యదర్శి సుధాంశ్ పంత్ ఐఏఎస్ సోమవారం హైదరాబాద్‌లో పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ కులాల అభివృద్ధి, బీసీ సంక్షేమం , దివ్యాంగుల సంక్షేమం, ట్రాన్స్‌జెండర్ సంక్షేమం వంటి రంగాల్లో అమలు చేస్తున్న పలు పథకాలు, కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమీక్షించారు.అంతకు ముందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి రాష్ట్రంలో అమలవుతున్న ఎస్సీ అభివృద్ధి, దివ్యాంగుల సాధికారత, ట్రాన్స్‌జెండర్ సంక్షేమం, వృద్ధుల సంరక్షణ వంటి పథకాలపై సమగ్ర నివేదికను సమర్పించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతోందని మంత్రి వివరించారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, వృద్ధుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ప్రభుత్వం కట్టుదిట్టంగా పనిచేస్తోందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు కేంద్రం పూర్తి సహకారం అందించాలని మంత్రి కోరగా, సుధాంశ్ పంత్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రం ప్రతిపాదించే ప్రతి వినూత్న పథకానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.తదనంతరం మసాబ్ ట్యాంక్‌లోని డే కేర్ సెంటర్, ఓల్డ్ ఏజ్ హోమ్, డీ-అడిక్షన్ కేంద్రాలను సందర్శించి అక్కడి సదుపాయాలను పరిశీలించారు.వృద్ధుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు, డే కేర్ సెంటర్ల నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.అవసరమైతే కేంద్రం నుంచి మరిన్ని నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.ప్రత్యేకంగా ట్రాన్స్‌జెండర్ల కోసం చేపట్టిన నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన, కార్ డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు.దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న సమగ్ర సంక్షేమ పథకాలు, ఆధునిక సదుపాయాల కల్పనను అభినందించారు.తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తల్లిదండ్రుల సంరక్షణ చట్టం అమలుతో వృద్ధుల భద్రతకు ప్రాధాన్యం పెరిగిందని, ఇది దేశవ్యాప్తంగా విశేష ఆదరణ పొందుతోందని పేర్కొన్నారు.ముఖ్యంగా మత్తు వ్యసన నిర్మూలనపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారని, హైదరాబాద్ సహా జంట నగరాల్లో ఆధునిక డీ-అడిక్షన్ కేంద్రాల ద్వారా యువతకు పునరావాసం కల్పిస్తున్నామని మంత్రి వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని సుధాంశ్ పంత్ ప్రశంసించారు. కేంద్రంలో రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులను వీలైనంత త్వరగా విడుదల చేస్తామని మంత్రి కి హామీ ఇచ్చారు.సంక్షేమ రంగంలో తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధి, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న ఫలితాలు తనను ఎంతో ఆకట్టుకున్నాయని ఈ సందర్భంగా సుధాంశ్ పంత్ వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్య సాచి ఘోష్, దివ్యాంగుల సంక్షేమ శాఖ కమిషనర్ అనిత రామచంద్రన్, ఎస్సీ డి డి వీసీ & ఎండీ హనుమంత్ నాయక్, డైరెక్టర్ శ్రీధర్, దివ్యాంగుల శాఖ డైరెక్టర్ శైలజ , TGSWREIS జాయింట్ సెక్రెటరీ సక్రు నాయక్తదితర అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడిలో బియ్యం, పప్పు పంపిణీ

విశ్వంభర, గుండాల:

అంగన్‌వాడి పాఠశాలలో వేసవి సెలవుల సందర్భంలో, విద్యార్థుల పోషకాహారాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా బియ్యం మరియు పప్పు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గద్వాల ఉపేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పేద మరియు అంగవికల వర్గాల పిల్లలు కూడా పోషకాహారం లోపించకుండా ఉండేందుకు ప్రభుత్వం తీసుకొస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. వేసవి సెలవుల్లో కూడా పిల్లల ఆరోగ్యం కాపాడడం తమ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు.అలాగే గ్రామంలోని ప్రతి అర్హులైన లబ్ధిదారులకు ఈ సౌకర్యం చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో కూడా ప్రజల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.

వరి గడ్డి మొక్కజొన్న చొప్ప కాల్చవద్దు..

విశ్వంభర,ఇనుగుర్తి:వరిగడ్డి,మొక్కజొన్న చొప్ప, పత్తి వ్యర్థాలను కాల్చవద్దని ఎం ఏ ఓ భూక్య మహేందర్ రైతులకు సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రైతు వారోత్సవాలు పురస్కరించుకొని మండలంలోని చిన్న ముప్పారం రైతు వేదికలో సోమవారం క్లస్టర్ గ్రామాల రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో అవగాహన కల్పిస్తూ ప్రస్తుతం పంటల వ్యర్థాలైన వరి గడ్డి,మొక్కజొన్న చప్పల ను రోటివేటర్తో దున్ని భూమిలో కలిపితే సేంద్రీయ కర్బనం పెరుగుతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువులు జీలుగలు, జనుము, పెసర వంటి ఉపయోగాలు,మట్టి పరీక్షల తో ప్రయోజనం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాయలి భవాని,పెద్దతండ సర్పంచ్ బానోతు రేణుక నరేష్,ఉప సర్పంచిలు మల్లం ఐలయ్య, లకావత్ భద్రు, ఆర్ ఐ మున్వర్,ఏఈవో ముజాహిద్,రైతులు ముదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, శేఖర్,కాలేరు నేతాజీ, భూక్య లాలు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు

విశ్వంభర,మహబూబాబాద్:

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ హైదరాబాద్ వారి సహకారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండలాలలోని గ్రామాలలో 10 కేంద్రాలలో వాలీబాల్, కరాటే, తైక్వాండో, వెయిట్ లిఫ్టింగ్ తదితర క్రీడలలో మే 5 నుండి జూన్ 7 వరకు తేదీ వరకు ఉదయం 6 గం'ల నుండి 8 గం'ల వరకు, సాయంత్రం 5 గం'ల నుండి 7 గం'ల వరకు ఉచిత క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి డా.ఓలేటి జ్యోతి నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భముగా ఆసక్తి గల 14 సంవత్సరములలోపు బాల బాలికలు క్రింద తెలిపిన నెంబర్ లకు ఫోన్ చేసి ఉచిత శిక్షణ పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి డా.ఓలేటి జ్యోతి సెల్.9440630681 నెంబర్ లో సంప్రదించగలరని అన్నారు.

రైల్వే పోస్టుల తగ్గింపుపై ఏఐవైఎఫ్ ఆగ్రహం

విశ్వంభర, హిమాయత్‌నగర్ :

రైల్వే శాఖలో 2 శాతం పోస్టులను తగ్గించే నిర్ణయం పై అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆగ్రహం వ్యక్తం చేసింది. మానవశక్తి హేతుబద్ధీకరణ పేరుతో సుమారు 29,608 పోస్టులను పునఃపంపిణీ, సరెండర్ చేయడం యువత భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంది. హైదరాబాదుహిమాయత్‌నగర్‌లో నిర్వహిం చిన సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ గోడపత్రికను విడుదల చేశారు. రైల్వేలో ఇప్పటికే లక్షల సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకుండా పోస్టులను తగ్గించడం ఉద్యోగావకాశాల సంకుచితానికి దారితీస్తుందని విమర్శించారు. సుమారు 14.80 లక్షల పోస్టుల్లో ప్రస్తుతం సుమారు 11 లక్షల మంది మాత్రమే పనిచేస్తుండగా, 3-4 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. నియామక ప్రక్రియలు ఆలస్యమవుతుండటంతో అభ్యర్థులు నిరీక్షణలో ఉన్నారని పేర్కొన్నారు. ఉద్యోగాలను పెంచాల్సింది పోయి తగ్గించడం సరైంది కాదని, ఇది యువతకు నష్టం కలిగించే నిర్ణయమని తెలిపారు. మే5 నుంచి 7 వరకు పోస్టుకార్డులు, ఈమెయిల్స్ ద్వారా నిరసన తెలియజేయాలని, మే 8న హైదరాబాదులోని రైల్ నిలయం వద్ద ముట్టడి కార్యక్రమం నిర్వ హించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నేర్లకంటి శ్రీకాంత్, అరుణ్, మనోజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రోడ్డుపై రైతుల భారీ ధర్నా రాస్తారోకో

విశ్వంభర, రామన్నపేట:

యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి నెల రోజులు దాటినప్పటికీ ధాన్యం కొనుగోలు చేయట్లేదని రామన్నపేట మండల తహసిల్దార్ ఆఫీస్ వద్ద రహదారిపై మండలంలోని రైతులు పెద్ద ఎత్తున ధర్నా రాస్తారోకో నిర్వహించారు. రైతులు ధర్నా చేస్తున్న క్రమంలో పోలీసులకు రైతులకు వాగ్వాదం చోటుచేసుకుంది. రామన్నపేట మండల తహసిల్దార్ వచ్చి భరోసా ఇవ్వకపోవడంతో రైతులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రైతులు మాట్లాడుతూ, మార్కెట్లలో ధాన్యం పోసి నెల రోజులు గడుస్తున్న కొనకపోవడంతో వర్షాలతో ధాన్యం తడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, హమాలి వాళ్లను, లారీలను అందుబాటులో ఉంచాలని, రైస్ మిల్లుల దోపిడిని అరికట్టాలని, క్వింటాలుకు ఐదారు కేజీలు తరుగు వేస్తున్న రైస్ మిల్లులను సీజ్ చేయాలని, కాంట వేసిన 24 గంటల్లో రైతులకు డబ్బులు వేయాలని, అవినీతికి పాల్పడుతున్న అధికారులను తీసివేయాలని, ఈ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని చెప్పి రైతులను అరిగోసలు పెడుతుందని, అధికారంలోకి రాగానే రైతు డిక్లరేషన్ అమలు చేస్తామని చెప్పి దాని ఊసే లేదని, రైతుబంధుకు మంగళం పలికి, రైతు కూలీల మాటే లేదు, రైతును రాజును చేస్తామని చెప్పి రైతులపైనే రాజకీయం చేస్తున్న ఈ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్తామని అన్నారు. వెంటనే ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని, ఎలాంటి తరుగు కోతలు లేకుండా చూడాలని 24 గంటల్లో రైతుల అకౌంట్లో డబ్బులు పడేలా చేయాలని రైతులన్నారు. ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, పిట్ట కృష్ణారెడ్డి ముద్రబోయిన శ్రీశైలం, గుండాల మల్లేష్, భూర్ర సైదులు, కొమ్మనబోయిన ఆదినారాయణ, పిట్ట చలపతి రెడ్డి, నడిగోటి మారయ్య, తరాల నరసింహ, పెట్టా నరసింహారెడ్డి, సాగర్ల శ్రీశైలం, కన్నెబోయిన శేఖర్, చింతకాయల నరేష్, నరేందర్ రెడ్డి, వేముల లింగస్వామి, వేముల వెంకన్న, గుండు రమేష్, కన్నెబోయిన వెంకన్న, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైస్ మిలర్ల దోపిడీని అరికట్టాలి

విశ్వంభర, గుండాల: తాలు,తరుగు పేరుతో రైస్ మిల్లర్లు రైతులను చేస్తున్న దోపిడీ అరికట్టి ధాన్యం కాంటాలు,ఎగుమతి, దిగుమతులను వేగవం తం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెపురం రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం జిల్లా పార్టీ పిలుపు మేరకు మండలంలోని నూనెగూడెం,మరిపడిగ గ్రామాలలోని ఐకేపీ, పిఏసియస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్సుపోర్టు కాంట్రాక్టర్ కాంటా వేసిన ధాన్యం బస్తాలకు సరిపడా లారీలను కల్లాల వద్దకు పంపాలని డిమాండ్ చేశారు.రైతులు తమ ధాన్యపు రాసులను కొనుగోలు కేంద్రాలలో పోసి నెల రోజులుగా నిల్వ ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆరుకాలం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకునేందుకు చాలా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించి నామమాత్రంగా కాంటాలు వేయటం వల్ల రైతులు రోజుల తరబడి ధాన్యపు రాసుల వద్ద పడిగాపులు పడున్నారని పేర్కొన్నారు.కాంటా వేసిన ధాన్యం బస్తాలు లారీలలో రైస్ మిల్లుకు తరలించినప్పటికి,రైస్ మిల్లు యజమానులు వెంటనే దిగుమతి చేయకుండా బి గ్రేడ్ వేసి తాలు,తరుగు పేరుతో క్వింటాలుకు ఐదు కేజీలు కట్ చేసేందుకు అనుమతిస్తేనే లోడ్ దించుకుంటామని రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు.అకాల వర్షాలు వాతావరణ మార్పులతో దాన్యం తడిసిపోతుందనే భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారని,కొనుగోలు కేంద్రాలలో పెద్దఎత్తున నిల్వలు పేరుకుపోవడం,బహిరంగ ప్రదేశాలలో దాన్యం నిల్వ ఉంచడం వల్ల రైతులకు తీరని నష్టం జరుగుతుందని అన్నారు. మద్దత్తు ధర చెల్లించవలసిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం,అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిండం రైతులనుఅన్యాయం చేయడమేనని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో దాన్యం రాసులు,రైస్ మిల్లులను ప్రత్యక్షంగా పరిశీలించి కొనుగోళ్ళు వేగవంతం చేసి,రైతులు నష్టపోకుండా ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అనంతుల అంజయ్య,పెద్ద రామయ్య,రైతులు శ్రీనివాస్ రెడ్డి,బిక్షం రెడ్డి,పానుగంటి ఎల్లయ్య,లింగస్వామి,పూలమ్మ,సాయి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో కాటాలు ప్రారంభించాలి

విశ్వంభర,నెల్లికుదురు: ధాన్యం కొనుగోలు కేంద్రంలో కాటాలను ప్రారంభించాలని సిపిఎం మండల కార్యదర్శి ఇసంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెల్లికుదురు మండలం రాజుల కొత్తపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు సెంటర్‌ను సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి 20 రోజులు దాటినా కాంటాలు ప్రారంభించకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎండలో కర్షకులు ఇబ్బందులకు గురవుతున్నారని కనీస వసతులైన త్రాగునీరు, టెంటు వంటి సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమన్నారు.వెంటనే కాంటాలు షురూ చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య,బొంతల బిక్షపతి,కవిత,వెంకటయ్య రైతులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల పిర్యాదుల పరిశీలన

విశ్వంభర,సూర్యాపేట:

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహిం చిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ ప్రజల నుండి వినతులు స్వీక రిం చారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి ని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు.ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమ స్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికా రులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం

విశ్వంభర, మహాదేవపూర్:

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో డిమాలిష్ చేసిన పాత గదులకు సంబంధించిన సామాగ్రి అక్రమంగా విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని మంథని నియోజకవర్గ బిఆర్ఎస్ మహిళ ఇంచార్జ్ కేదారి గీత పేర్కొన్నారు. మన జిల్లాలో ఇరువైనాలుగు పాఠశాలల్లో శిథిలావస్థకు చేరిన పాత గదులను డిమాలిష్ చేసే ప్రక్రియ జరుగుతుంది. ఇందులో భాగంగా మహాదేవపూర్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది గదులను కూడా డిమాలిష్ చేయుచున్నారు. నిబంధనల ప్రకారం డిమాలిష్ అనంతరం ఆయా గదుల్లో వినియోగించిన విలువైన టేకు కలప, ఇనుప సామాగ్రి,ఇతర నిర్మాణ వస్తువులను ప్రభుత్వ ఆధీనంలో భద్రపరిచి, నిబంధనల మేరకు బహిరంగ వేలం ద్వారా విక్రయించాలి. కానీ కొందరు పాఠశాల సిబ్బంది, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం, కలసినిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి వేలం నిర్వహించకుండా సదరు సామాగ్రిని అక్రమంగా విక్రయించినట్లు తెలిసినది. కావున తమరు దయతో ఈ విషయంలో జోక్యం చేసుకొని, పూర్తిస్థాయి విచారణ జరిపించి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై గ్రామపంచాయతీ పాలకవర్గం పై, శాఖపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుచున్నాను. అంతేకాకుండా అక్రమంగా విక్రయించిన ప్రభుత్వ సామాగ్రిని తిరిగి స్వాధీనం చేసుకొని, నిబంధనల ప్రకారం బహిరంగ వేలం నిర్వహించేలా తగు ఆదేశాలు జారీ చేయగలరని ఆమె జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే ' బి ఎల్ ఆర్ ' భరోసా పంపిణీ

విశ్వంభర, మిర్యాలగూడ,

విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ, వారి ఉన్నత చదువులకు అండగా నిలుస్తామని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బి ఎల్ ఆర్.. పునరుద్ఘాటించారు. సోమవారం రోజున ఎమ్మెల్యే పుట్టినరోజును పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఘనంగా సన్మానం చేశారు.స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో, నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల నుండి అత్యధిక మార్కులు సాధించిన 66 మంది విద్యార్థులను ఎంపిక చేసి సత్కరించారు.విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు మొత్తం రూ. 25 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని ఎమ్మెల్యే పంపిణీ చేశారుఈ కార్యక్రమంలో టీటీడీ జేఈఓ శరత్ కుమార్, డిఎస్పీ రాజశేఖర్ రాజు, డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాస్ నేత, మున్సిపల్ చైర్మన్‌లిచిలుకూరి సుధా బాలు వైస్ చైర్మన్ గుడిపాటి శిరీషనవీన్ , పాల్గొన్నారు.అనంతరం స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సమాజానికి దిశానిర్దేశం చేసిన గొప్పవ్యక్తుల స్ఫూర్తి నేటి యువతకు అందాలనే ఉద్దేశంతో ఈ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

విధులకు గైర్హాజరైన రికార్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్ చేసిన కలెక్టర్

విశ్వంభర, పెద్దపల్లి:

పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీ కె. చిరంజీవిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉత్తర్వులు జారీ చేశారు. కె. చిరంజీవి విధులకు గైర్హాజరు కావడంతో పాటు, ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడం, వివరణ కోరుతూ జారీ చేసిన మెమోలను స్వీకరించకపోవడం గమనార్హమని కలెక్టర్ తెలిపారు.ఈ విషయంపై కమాన్‌పూర్ తహసీల్దార్ నివేదిక అందడంతో, సంబంధిత ఉద్యోగిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు .అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా, శాఖాపరమైన విచారణ చేపట్టనున్న నేపథ్యంలో, ఎ.పి. సివిల్ సర్వీసెస్ (సీసీఏ) నిబంధనల ప్రకారం శ్రీ కె. చిరంజీవిని సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుండి అమల్లో ఉంటాయని, విచారణ పూర్తయ్యే వరకు కొనసాగుతాయని తెలిపారు. సస్పెన్షన్ కాలంలో సంబంధిత ఉద్యోగి ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను వీడరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అవినీతిపరులపై చర్యలు తీసుకోకుండా బాధితులకు న్యాయం జరగదు

విశ్వంభర, మహబూబ్ నగర్: డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని పట్టాలు తీసుకున్న వారికి మొదటి ప్రాధాన్యతగా న్యాయం చేయాలి.అవినీతికి పాల్పడ్డ అధికారులను రక్షించడం కొరకే డబల్ బెడ్ రూమ్ ల విచారణకు పూనుకోవటం లేదు. మహబూబ్ నగర్ ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రారంభించిన ప్రజావాణి సమావేశంలో టిఎఫ్టియు ఆధ్వర్యంలో డబల్ బెడ్ రూమ్ బాధితులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి టిఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ ఎం ఖలీల్ మాట్లాడుతూ డబల్ బెడ్ రూమ్ బాధితులకు న్యాయం చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. మహబూబ్ నగర్ పట్టణంలోని సర్వేనెంబర్ 25, ద్యూటీ పల్లి, ఏనుగొండ, సర్వే నంబర్ 523, వీరన్నపేట్ లో ఉన్న అన్ని డబల్ బెడ్ రూమ్ లపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా ఈ డిమాండ్ చేస్తున్నప్పటికీ అధికారులు పెడచెవిన పెట్టడం విచారకరమన్నారు. గతంలో రెవెన్యూ అధికారులు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు చేసిన అవినీతి బయటపడుతుందనే ఉద్దేశంతో అధికారులను రక్షించడం కొరకేఇవాళ విచారణ చేపట్టడంలేదని ఆయన విమర్శించారు.వాటిపై సమగ్ర విచారణ చేస్తే అధికారుల అవినీతి బండారం బయటపడుతుందన్నారు. మరియు అర్హులైన పేదలకు న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉండి అవినీతిలో భాగస్వాములైన నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోవడం వల్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా విచారణ కొరకు ప్రభుత్వ యంత్రాంగం పై ఒత్తిడి తేవడం లేదని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వము కూడా అర్హులైన పేదలకు న్యాయం చేయకుంటే అందుకు తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. 523లో పట్టా సర్టిఫికెట్లు ప్రభుత్వానికి స్వాధీనపరిచిన వాళ్ళందరికీ డబల్ బెడ్ రూమ్ లు ఇవ్వాలని ఆయన కోరారు. కొంతమందికి మాత్రమే డబుల్ బెడ్ రూమ్ లు ఇచ్చి పట్టాలు కోల్పోయిన వందల మందికి పంగనామం పెట్టే ప్రయత్నం అధికారులు చేస్తున్నట్లు ఆయన అనుమానాన్ని వ్యక్తపరిచారు. ఇదే జరిగితే దిక్కుమక్కు లేని పేద ప్రజలు తెగించి పోరాటం చేస్తారని దానికి జిల్లా ప్రభుత్వ యంత్రాంగం కాంగ్రెస్ పార్టీ నాయకత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు జి. గట్టన్న, డబల్ బెడ్ రూమ్ బాధితులు లక్ష్మీదేవి, శ్రీదేవి, దివ్య, మాధవి, ధనుంజయ, లలితా,బేగం పాషా, ముంతాజ్ పాల్గొన్నారు.

ఎంజిఎన్ఆర్ఈజిఎస్ అంశాల మీద రివ్యూ మీటింగ్....

విశ్వంభర, రామన్నపేట: సోమవారం రోజు యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలో ఎంజిఎన్ఆంఈజిఎస్ అంశాల మీద మండల ఎంపిడిఓ ఆధ్వర్యంలో ఎంపీడిఓ కార్యాలయంలో రివ్యూ మీటింగ్ నిర్వహించబడినది. ఈ సమావేశంలో అన్ని గ్రామాలలో కనీసం 100 మందికి తగ్గకుండా కూలీలను పెంచడం కోసం ప్లానింగ్ చేయాలని మండల ఎంపీడిఓ రివ్యూ చేయడం జరిగింది. ఈ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈజిఎస్ మండల సిబ్బంది హాజరైనారు.